# అందం

"ఒరేయ్ భాస్కర్.. టైమ్ తొమ్మిదవుతోంది, ఏమిట్రా ఈ మొద్దునిద్ర..'' అంటూ ప్రతిరోజులాగే ఆరోజు కూడా నిద్ర లేపి, టేబుల్ మీద కాఫీ పెట్టి వెళ్లింది అమ్మ.

బద్ధకంగా లేచి, కాఫీ త్రాగుతూ కిటికీలోంచి బయటకు చూశాను. బయట చాలా హడావుడిగా వుంది. మొన్ననే లక్ష్మీ ఆంటీ ఖాళీ చేసిన ఎదురింటి పోర్షన్‌లోకి ఆరోజే ఎవరో కొత్తగా అద్దెకు దిగారు. ఎవరో పెద్దాయన, పక్కనే ఓ అమ్మాయి.. సామాన్లు సర్దుతున్నారు.

ఎన్నడూ చూడని, కళ్లు చెదిరేంత అందమైన అమ్మాయి నా కంట పడింది. కలువ రేకుల్లాంటి కళ్లు, కోటేరు లాంటి ముక్కు, దొండపండు లాంటి పెదవులు, శంఖం లాంటి మెడ. ఆమె అందం మాటల్లో వర్ణించలేనిది. నన్ను నేను మైమరచి ఆ అమ్మాయి వైపు చూస్తూండిపోయాను.

"అన్నయ్యా!'' అన్న పిలుపు వినేసరికి మామూలు స్థితికి వచ్చాను. అవును, సుజాతను కాలేజీ దగ్గర విడిచిపెట్టాలన్న విషయం మర్చిపోయాను. ఆ రోజంతా ఆమెను ఎంత మరచిపోదామన్నా నావల్ల కాలేదు.

ఎదురింట్లో కొత్తగా దిగిన ఫ్యామిలీ గురించి నాన్నతో అమ్మ చెబుతుంటే, నేను చాటుగా విన్నాను. స్వస్థలం రాజమండ్రి. ఉద్యోగం నిమిత్తం ఈ ఊరు ట్రాన్స్‌ఫరయ్యారట. పేరు రాజారాం. ఆయన భార్య అనారోగ్యంతో చనిపోయిందట. కూతురు పేరు స్వప్న. పెద్దల పట్ల మర్యాదగలది, గుణవంతురాలని తెలిసింది.

మరుసటిరోజు ఇంటిదగ్గర స్వప్న అమ్మతో మాట్లాడుతూ కనబడింది. అమ్మ నన్ను పిలిచి, స్వప్నను తీసుకెళ్లి సూపర్ మార్కెట్ చూపించమంది. స్వప్న నాకు పరిచయమైంది. అప్పటినుంచీ ఆమె తరచూ మా ఇంటికి వస్తూవుండేది.

అలా స్వప్నతో స్నేహం కలిసిన తర్వాత, ప్రతిరోజూ ఆమెతో మాట్లాడాలన్న ఆరాటం నిమిషం నిలవనివ్వడం లేదు. పదే పదే ఆమెను కలవాలనిపిస్తోంది. మళ్లీ మళ్లీ ఆమెను చూడాలనిపిస్తోంది. ఒక్క రోజు చూడకున్నా ఏదో కోల్పోయినట్టు వెలితిగా వుంటోంది. ఇది స్నేహమా, ప్రేమా? కేవలం ఇష్టమా, ఆకర్షణా?... నా మనసుకు మాత్రం ఇది ప్రేమేననిపిస్తోంది.

మా పరిచయం మామూలుగా మాట్లాడుకునే దగ్గరినుంచి పార్లర్‌లో ఐస్‌క్రీం తినడం వరకూ వచ్చింది. కాలమెంత త్వరగా పయనిస్తుందా అనిపించింది. నేను స్వప్నని ప్రేమిస్తున్నట్టు నా స్నేహితులకు తెలిసిపోయింది.

ఆ తర్వాత నా మనసులో మాట స్వప్నకి చెప్పాలనుకున్నాను. కొద్దిరోజుల్లోనే ఆ విషయం ఆమె కనిపెట్టేసింది. కానీ తనేమీ బయటపడలేదు. ఒకరోజు నేను ధైర్యం చేసి "ఐ లవ్ యు'' అని చెప్పేశాను. ఎంతో ఆతృతతో ఆమె సమాధానం కోసం ఎదురుచూశాను.

స్వప్న తన మనసులో వున్నది నిర్భయంగా చెప్పింది. "నేను నిన్ను ప్రేమించడం లేదు. నా అందానికి తగిన



అందగాడు, డబ్బున్నవాడు వస్తాడు. నీదగ్గర ఏముందని ప్రేమించాలి? ఎవరినైనా ట్రై చెయి..'' అంటూ నన్ను, నా ప్రేమను తిరస్కరిస్తూ- హేళన చేస్తూ మాట్లాడింది. నా కళ్లు నీళ్లతో, హృదయం బాధతో బరువెక్కాయి.

నెలరోజులు తిరక్కుండానే స్వప్న అన్నట్టు అందం, డబ్బు వున్న వ్యక్తిని పెళ్లి చేసుకుంది. ఆమెను ఎంత మరచిపోదామన్నా నావల్ల కావడం లేదు. ఈ విషయం నాన్నకు తెలిసి, నాకు చీవాట్లు పెట్టారు. ఆయన చెల్లెలు కూతురు పూర్ణిమని నాకిచ్చి పెళ్లి చేస్తామన్నారు. నేను ససేమిరా ఒప్పుకోలేదు. "నువ్వు ఒప్పుకోకపోతే నా శవాన్ని చూస్తావు'' అన్నారు. అన్నట్టుగానే ఈ లోకాన్ని విడిచి వెళ్లిపోయారు.

నాన్నగారు చనిపోగా, వచ్చిన పి.ఎఫ్‌తో సుజాత పెళ్లి చేసాం. ఇక చేసేదేం లేక పూర్ణిమ అందంగా లేకపోయినా, నేను పెళ్లి చేసుకోక తప్పలేదు. నేను చదివిన చదువుకు ఒక చిరుద్యోగం సంపాదించాను. మేమంతా సంతోషంగానే వున్నా, అది చూడటానికి నాన్న లేరు.

ఒక సంవత్సరం గడిచిపోయింది. పూర్ణిమతో సరిగా మాట్లాడమనీ, ఆమెను ప్రేమగా చూసుకోమనీ అమ్మ నాతో రోజూ చెప్పేది. స్వప్న జ్ఞాపకాలు నన్ను వెంటాడుతూ వుండేవి. అందువల్ల పూర్ణిమను కాస్త అశ్రద్ధ చేసిన మాట వాస్తవమే!

ఒకసారి ఆఫీసులో వుండగా పూర్ణిమ నుంచి ఫోన్ వచ్చింది, అమ్మను హాస్పిటల్లో జాయిన్ చేశారని. ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఒక్క ఉదుటున హాస్పిటల్‌కి చేరాను. అమ్మను చూసి నా కళ్లంట నీళ్లొచ్చాయి. ఇప్పుడు పరిస్థితి బాగానే వుందని డాక్టర్ చెప్పేసరికి కాస్త ఊపిరి పీల్చుకున్నాను.

ఆ పక్క వార్డులో ఒక వ్యక్తి కూర్చుని ఏడుస్తున్నాడు. తెలిసిన వ్యక్తిలా అనిపించేసరికి దగ్గరగా వెళ్లాను. ఆయనెవరో కాదు, స్వప్న తండ్రి. ఏమయిందని అడిగేసరికి ఆయన జరిగిందంతా చెప్పారు.

పెళ్లయిన నెల రోజులకే స్వప్నకి వాళ్లాయనతో ఏవో గొడవలవుతూ వచ్చాయనీ, అతను స్వప్నను బాగా హింసించేవాడనీ తెలిసింది. డబ్బు కోసం చాలా ఇబ్బంది పెట్టేవాడట. చివరికి వాళ్లత్త, ఆయన కలసి స్వప్న ఒంటిపై కిరోసిన్ పోసి, ఆమెను చంపడానికి ప్రయత్నించారట. స్వప్నని ఈ వార్డులోనే జాయిన్ చేశారని ఆయన చెప్పారు.

స్వప్నని అలాంటి దీనమైన పరిస్థితిలో చూసేసరికి నాలో చలనం ఆగిపోయింది. కలువ రేకుల్లాంటి కళ్లు లేవు. కోటేరు లాంటి ముక్కు లేదు. దొండపండు లాంటి పెదవులు లేవు. ఒళ్లంతా కాలిన గాయాలతో మొహం కూడా గుర్తుపట్టలేనంత వికృతంగా వుంది ఆమె.

ఆ సమయంలో పూర్ణిమ అమ్మకు చేస్తున్న సేవలు చూస్తుంటే నాకు పెద్దల మాట గుర్తొచ్చింది- 'అందం కొనుకు తింటామా.. బుద్ధి మంచిది కావాలిగాని'. పూర్ణిమను ప్రేమగా చూసుకోవాలని ఆరోజే నిశ్చయించుకున్నాను. మంచితనాన్ని మించిన అందం లేదని నాకు తెలిసొచ్చింది.

- జి.శివప్రసాద్ (నర్సీపట్నం)

